మలుపులు.. ప్రమాదాలకు నెలవులు

- ఆదమరిస్తే ఆస్పత్రుల పాలే!
- తరచూ ప్రమాదాలు.. స్పందించని అధికారులు
- రోడ్డు మార్జిన్లలో పెరిగిన తుప్పలు, చెత్త
- భయాందోళనలో ప్రయాణికులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు–గుండుగొలను (ఈజీకే) రహదారిలో కొమడవోలు పరిధిలో రోడ్ల మలుపులు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు తూర్పు లాకుల వంతెన వద్ద నుంచి ఏలూరు రూరల్ మండలం మల్కాపురం మధ్య ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని కొమడవోలు ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలోని డబల్ రోడ్డు పెరిగిన మొక్కలు, చెత్త చెదారం, రోడ్డు పక్కన అక్కడక్కడా ఆక్రమణల వల్ల సగానికి కుచించుకు పోయింది. ఈ మార్గంలో ఎక్కువగా మలుపులు ఉన్నాయి. దీంతో దగ్గరకు వచ్చేంత వరకు ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తునే ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు రక్షణ చర్యలు చేపట్టకపోవడం పట్ల స్థానికులు, వాహనచోదకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జంగిల్ క్లియరెన్స్‌పై నిర్లక్ష్యం

వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. నిధులు కేటాయించడంతో రోడ్లు భవనాల శాఖ ఏలూరు తూర్పులాకుల నుంచి గుండుగొలను వరకు జేసీబీ సాయంతో జంగిల్ క్లియరెన్స్ చేసేవారు. పూర్తి స్థాయిలో విశాలంగా రోడ్డు కనిపించడంతో వాహనదారులకు సౌకర్యవంతంగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు కేటాయించకపోవడం, కార్పొరేషన్ అధికారులు ఈ ప్రాంతంపై దృష్టి సారించకపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి.


కొమడవోలు రైస్ మిల్లు వద్ద ఉన్న ప్రమాదకర మలుపు


కొమడవోలు కోతుల మిల్లు వద్ద ఉన్న మలుపులో పెరిగిన మొక్కలు


తూర్పులాకుల సమీపంలోని సాయిబాబా గుడి వద్ద ఉన్న మలుపు


కొమడవోలు ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

తరచూ ప్రమాదాలు



తూర్పులాకుల నుంచి మల్కాపురం వచ్చే రోడ్డులో ఉన్న మలుపుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా రోడ్డు మూసుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనం కనబడని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో రోజుకు నాలుగైదుసార్లు రాకపోకలు సాగిస్తుంటాను. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనే భయాందోళన చెందాల్సిన దుస్థితి ఏర్పడింది.

– వెంపా నాగరాజు, మల్కాపురం, ఏలూరు రూరల్ మండలం

అశ్రద్ధ తగదు



ప్రధాన రహదారుల వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించే విధంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది. వైఎస్సార్ సీపీ హయాంలో జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు కేటాయించేవారు. తాజాగా వచ్చిన కూటమి ప్రభుత్వం జంగిల్ క్లియరెన్స్ పట్ల శ్రద్ధ చూపకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– గారపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి, ఏలూరు

క్లుప్తంగా

ఆకతాయిలపై నిఘా పెంచాలి


కళాశాలల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలోని కళాశాలల వద్ద విద్యార్థినులపై ఆకతాయిల వేధింపులను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా ఉంచాలని, ప్రతి కాలేజీ వద్దా విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ తెలిపారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నగరంలో వివిధ కళాశాలల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జూనియర్, డిగ్రీ కాలేజీల వద్ద విద్యార్థినులపై ఆకతాయిల వేధింపులను అరికట్టేందుకు కాలేజీ యాజమాన్యాలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి కాలేజీ వద్దా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల కదలికలపై నిత్యం పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. క్లాస్‌రూమ్స్, కళాశాల వరండాలు, ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైఫై సదుపాయం గల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటంతోపాటు సీసీ కెమెరాల లింకును ఏలూరు పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు.

పోలవరం నిర్వాసిత రైతుల ఆందోళన


ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న పోలవరం నిర్వాసిత రైతులు

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, రైతులు బ్యాంక్ అధికారుల తీరు వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగ ప్రభాకర్ ,జిల్లా నాయకులు ఎం.వెంకటాచారి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బాధిత రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2017లో తీసుకున్న రుణాలకు సంబంధించి పోలవరం నిర్వాసిత రైతుల వద్ద భూసేకరణ డబ్బుల నుంచి రికవరీ చేశారని వారు తెలిపారు. భూసేకరణ డబ్బులు రాకముందే రికవరీ చేసిన బ్యాంకు.. మళ్లీ భూ సేకరణ డబ్బుల నుంచి కూడా రికవరు చేయటం విడ్డూరంగా ఉందని వారు పేర్కొన్నారు. సుమారు 130 మంది రైతుల నుంచి రెండు సార్లు రికవరీ చేశారని.. ఒక దానిని వడ్డీతో సహా రైతులకు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లోన్ యాప్స్‌తో జాగ్రత్త


మహిళల సమస్య వింటున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ప్రజలు డబ్బుల కోసం రుణ యాప్స్‌ను ఆశ్రయించి ఇబ్బందులకు గురవ్వవద్దని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 35 ఫిర్యాదులు అందగా, వాటి పరిష్కారానికి పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఏలూరు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజలను భోజన సదుపాయం కల్పించారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా కామవరపుకోట మండలానికి చెందిన ఒక వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మానసికవేదనకు గురై పురుగుమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పొన్నగుల జీవరత్నం (54) భార్య మరణించడంతో కుమారుడుతో పాటు కొత్తవారిగూడెంలో నివసిస్తున్నాడు. అతనికి దీర్ఘకాలిక వ్యాధులు ఉండడంతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం మధ్యాహ్నం కలుపుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

జనవరిలో 5వ హేలాపురి బాలోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు వచ్చే జనవరిలో 5వ హేలాపురి బాలోత్సవం నిర్వహించనున్నట్టు హేలాపురి బాలోత్సవాల కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన నాలుగు ఉత్సవాలకు సంబంధించిన వివరాలతో కూడిన సావనీర్‌ను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రి సెల్వి చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో జేసీ పి.ధాత్రి రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారని తెలిపారు. సంబరాల సమన్వయకర్త గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల పిల్లల ప్రేమికులు సంయుక్తంగా బాలోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 40 కేంద్రాల్లో ఇలాంటి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఐదో పిల్లలు సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూలులో నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాలు సంస్థలకు చెందిన హేలాపురి బాలోత్సవం నిర్వాహకులు ఎంఎస్ కుమార్, వీజీఎంవీఆర్ కృష్ణారావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎస్ కస్తూరిరావు, వి.సురేష్, మేతర అజయ్‌బాబు, పి.ఆంజనేయులు, డి.శివప్రసాద్, వి.శేషగిరిరావు, కె.సిద్ధార్థ, ఎం సురేష్ బాబు, కె.సోమ్లా నాయక్, జి.సురేష్, ఎస్ రవి, కె.జనని, బి.సోమయ్య, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పిల్లల సంబరాల సావనీర్ విడుదల చేసిన ప్రతినిధులు

పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు నమోదుకు సంబంధించి దరఖాస్తు గడువు ఈ నెల 6వ తేదీతో ముగుస్తున్నందున త్వరపడాలని సూచించారు. ఓటరు నమోదు గడువు తేదీని పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కోరామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కార్తీక మాసం తొలి సోమవారం పర్వదినం సందర్భంగా నగరంలోని పలు శైవక్షేత్రాల్లో విశేష పూజలు చేశారు. పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి భక్తుల గోత్రనామాలతో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అన్నపూర్ణ అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ చేసి, ఆకాశదీప పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించి విశేష హారతి సేవ చేశారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో పూర్వాషాడ నక్షత్రంతో నిత్యపూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ఆకాశ దీప పూజ చేసి స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామికి ఉదయం మహన్యాస పారాయణ, లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు చేసి అనంతరం విశేష అలంకరణ, అర్చన చేశారు. సాయంత్రం ప్రదోషకాల అర్చన, రుద్ర త్రిశతి నామార్చన, బిల్వార్చన, శివ సహస్రనామ పారాయణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. శనివారపుపేట శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.


విశేషాలంకరణలో పవరుపేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారు


చౌడేశ్వర రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

'నన్నయ' టీమ్‌కు థెరిస్సా విద్యార్థినులు


కబడ్డీలో ద్వితీయ స్థానంలో నిలిచిన సెయింట్ థెరిస్సా కళాశాల విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్ ట్రయల్స్‌లో ఉమెన్స్ కబడ్డీలో తమ కళాశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారిణులు సౌత్ జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారని స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ పి.మెర్సి తెలిపారు. నవంబర్ 2, 3 తేదీల్లో కాకినాడలోని పీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో జరిగిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల, విశ్వవిద్యాలయ టీమ్ సెలక్షన్స్‌లో తమ కళాశాలకు చెందిన పి.కావ్య శ్రీ, పి.జోషిత, ఎం నవ్య శ్రీలు రెండో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. వీరు నవంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని అలగప్ప విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన 14 టీమ్‌లు సుమారు 200 మంది క్రీడా కారిణులు పాల్గొనగా తమ విద్యార్థులు రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. కళాశాల టీమ్‌కు కోచ్‌లు తిరుమలరావు, కె.నాగేశ్వరరావు, కళాశాల వ్యాయామాధ్యాపకులు మేజర్ పీఎం సెలీన్ రోస్, కె.శ్యామలలను, విజేతలను ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల, అధ్యాపకులు అభినందించారు.

మావో ఆలోచనా విధానంతో హక్కులకు రక్షణ



అమరవీరులకు జోహార్లర్పిస్తున్న కార్మికులు

ఏలూరు రూరల్ : ఆదివాసీ హక్కుల కాపాడుకోవాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే సాధ్యమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ కార్యదర్శి ఏలూరు వెంకట్రావు అన్నారు. విప్లవ ఉద్యమంలో అసువులు బాసిన రాయల సుభాస్‌చంద్రబోస్, నెక్కలపూడి రామారావు, ధర్మన్న, పాదం రామకృష్ణ, నంద్యాల సుబ్బారావు, అరుణోదయ రామారావులకు సోమవారం ఏలూరు మార్కెట్ యార్డ్‌లో కార్మికులు నివాళులర్పించారు. మావో ఆలోచన విధానమే ఆదివాసులకు, శ్రమజీవుల హక్కులకు రక్షణ కల్పిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.

మహిళా సంఘాల సమాచారాన్ని ఆన్‌లైన్ చేయాలి


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ రజనీకాంత్

ఏలూరు (టూటౌన్): స్వయం సహాయక సంఘాల సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్‌లో పొందుపరచాలని మెప్మా ఏఓ బి.రజనీకాంత్ అన్నారు. సోమవారం ఉదయం ఏలూరు షాదీఖానలో ఏలూరు జిల్లాకు సంబంధించిన ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బందికి, రిసోర్స్ పర్సన్లకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రజనీకాంత్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా మెప్మా మహిళా సంఘాల సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో లేక ప్రస్తుతం మిషన్ డైరెక్టర్ మెప్మా గుంటూరు ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్‌లో వాస్తవిక సమాచారాన్ని పొందుపరచుటకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక ప్రణాళికలను తయారు చేయుటకు, ప్రతి నెలా తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకొనేందుకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీఈలు, సీఎంఎంలు, సీఓలు, డీఈలు, డీపీఆర్, టీఎల్ఎఫ్ ఆర్పీలు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎన్నికల హామీ మేరకు ప్రతి రైతుకూ పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం స్థానిక చేపల తూము సెంటర్ వద్ద గల 27వ సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసిందని, రబి సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడి కోసం ఎంతో ఆశలతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. పంటకు కనీసం మద్దతు ధర ప్రకటించాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. దివంగత వైఎస్సార్ హయాంలో పలు జిల్లాల్లో సెజ్‌ల పేరుతో పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి సేకరించి వినియోగించకుండా ఉన్న భూములను తిరిగి రైతాంగానికి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి రఘు, కురెళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

పరమాత్మతో మమేకమే ధ్యానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆధ్యాత్మిక ఎదుగుదల అంటే ఆకారం నుంచి నిరాకారానికి, పదార్థం నుంచి యదార్థానికి ఎదగడమేనని, విశ్వాన్ని నడిపిస్తున్నది సంకల్ప శక్తేనని స్పిరుచ్యువల్ సైంటిస్ట్, హిప్నాటిస్ట్ ఉమాచండ్ అన్నారు. సోమవారం స్థానిక సత్రంపాడు దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఆవరణలో పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ మూమెంట్ వ్యవస్థాపకుడు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉచిత ధ్యాన జ్ఞాన శిక్షణ కార్యక్రమంలో ఉమాచండ్ మాట్లాడుతూ పరమాత్మతో మమేకం కావడమే ధ్యానమని తెలిపారు. ఆలయాలన్నీ శక్తిక్షేత్రాలన్నారు. ఈ విశ్వాన్ని నడిపిస్తున్నది సంకల్పశక్తి మాత్రమేనని, మనం చేసే పూజలు వ్రతాలు సంకల్పం లేకుండా ఉండవని చెప్పారు. మనం ఏది సంకల్పిస్తే విశ్వం అది అందించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పత్రీజీ కుమార్తె పరిమళ పత్రి ఆన్‌లైన్ ద్వారా తమసందేశాన్ని అందిస్తూ విశ్వంలోని ప్రకృతిని, సమస్త జీవరాసులను ప్రేమించాలని జీవరాసులకు హాని కలిగించే ఎటువంటి ఉత్పత్తులను వినియోగించరాదని కోరారు.


ఉమాచండ్‌ను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	11
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	23
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	07
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36–38	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	60	చిక్కుడు కాయలు	112
వంకాయలు (కాంతులు)	72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07,10
బెండకాయలు	30	కంద	68
పచ్చిమిర్చి	44–46	బీట్‌రూట్	48–64
కాకర కాయలు	44	కీరా దోస	36
బీరకాయలు	30–36	ఫ్రెంచ్‌బీన్స్	140
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80
క్యాబేజీ	36–40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	56	పాలకూర	15
దొండకాయలు	34	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	40,50,56	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	36–44	బఠాణి	--
ఆనబకాయ (1)	25–30	క్యాప్సికమ్	100
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36